

కల్యాణం.. కమనీయం!





సత్యనారాయణస్వామి, అనంతలక్ష్మి అమ్మవారిని పరిణయమాడిన వేళ ప్రకృతి పరవశించగా రత్నగిరి పులకించింది. మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు, సుగంధభరిత పుష్పపరిమళాలతో స్వామి సన్నిధి అణువణువునా కల్యాణ శోభతో శోభిల్లింది.. రత్నగిరి గురువారం ఉదయం నుంచి జనంతో కిక్కిరిసిపోయింది.. ఎటు చూసినా భక్తజనమే..కల్యాణ క్రతువు తిలకించేందుకు ఎక్కడెక్కడి నుంచో వేలాదిగా భక్తజనం తరలివచ్చారు.. కన్నులారా చూసి.. మనసారా స్వామిని దర్శించుకున్నారు.. ఉత్సవాల్లో భాగంగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ పట్టువస్త్రాలు అందించారు.

6



కల్యాణ శుభవేళ.. అన్నవరం మిలమిల..



కల్యాణం తిలకిస్తున్న జనం





పట్టువస్త్రాలు తెస్తున్న దృశ్యం

యుద్ధం.. సన్నద్ధం!

ఎందరో భారతీయ ఆడబడుచుల నుదుటి సిందూరాన్ని తుడిచేసిన ముష్కర మూకలకు ఇండియన్ ఆర్మీ ఆపరేషన్ 'సిందూర్' పేరుతో వరుసగా చావు దెబ్బలు కొడుతోంది. పహల్గాంలో పర్యాటకులను చంపి రక్తపుటేరులను పారించిన రక్తపిశాచుల పీచమణిచి పాతాళంలోకి తొక్కేస్తోంది. తుపాకీ గుళ్లతో కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ భారతీయ గుండెలను పదే పదే గాయపరుస్తోన్న పాకిస్తాన్‌కు దిమ్మ తిరిగేలా బుధ, గురువారాల్లో దెబ్బ కొట్టింది. సరిహద్దు స్థావరాల్లో సైనికులు ముష్కరమూకలను అడ్డుకుంటున్నారు.. ఒక్కడ వరకూ ఓకే.. మన వరకూ వస్తే ఏం చేయాలి.. అందుకే ఎవరేం చేయాలనే దానిపై గురువారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. మనమేంటో చూపాలి.. అప్రమత్తంగా ఉండాలంటూ పిలుపునిచ్చారు.

(కాకినాడ/కాకినాడ క్రైం, ఆంధ్రజ్యోతి)

జై భారత్.. జైజై భారత్ అంటూ ఆపరేషన్ సిందూర్‌లో మనం భాగం కావాల్సిన సమయం ఆసన్నమైంది.. ఎందుకంటే ప్రమాదం ఎటు నుంచి ఎలా వస్తుందో తెలియదు.. పాకిస్థాన్‌లో ఉగ్రవాద శిబిరాల ను, అక్కడి రక్షణ వ్యవస్థలను భారత్ ఆర్మీ ధ్వంసం చేసిన నేపథ్యంలో శత్రుదేశం నుంచీ పొంచి ఉన్న ముప్పుతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అప్రమత్తం చేస్తు న్నారు. మన వరకూ ప్రమాదం వస్తే మనమేం చేయాలి..ఎలా ఎదుర్కోవాలి.. బాంబులు వేస్తే ఎలా తప్పించుకోవాలనే దానిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు మాక్‌డ్రిల్ పేరుతో ఊరూ వాడా అవగాహన కల్పిస్తున్నారు. మరో వైపు ఆపరేషన్ సిందూర్ పేరుతో మన ఆర్మీ సాగిస్తోన్న పోరుకు మద్దతుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనేక సంస్థలు, వ్యక్తులు, పార్టీలు జాతీయ పతాకంతో సగర్వంగా జైహింద్ అంటూ నినదించారు. కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ జిల్లాల్లో యువత, పిల్లలు రోడ్డెక్కి గురువారం జాతీయపతాకంతో జయహో భారత్ అంటూ జేజేలు పలికారు.



వెపన్ గురి పెట్టినా భయపడొద్దు : రాజమహేంద్రవరం వై జంక్షన్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

- పాకిస్థాన్ నుంచి ముప్పు
- ఉమ్మడి జిల్లాలో హైఅలర్ట్
- తీరం వెంబడి డ్రోన్లతో నిఘా
- ఆరు నౌకల పహరా
- యుద్ధసన్నద్ధతపై మాక్‌డ్రిల్
- భద్రతపై ప్రజలకు అవగాహన



కాకినాడ రైల్వేస్టేషన్‌లో..



ప్రమాదాన పడితే..రక్షణగా..



మధురపూడి విమానాశ్రయంలో హైఅలెర్ట్ ప్రకటించారు.. భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రయాణికులను మాత్రమే లోపలకు అనుమతిస్తున్నారు.

దాడుల నుంచి తప్పించుకోవడమెలా : మధురపూడి ఎయిర్‌పోర్ట్‌లో అవగాహన



భయంతో పడిపోతే : రాజమహేంద్రవరంలో వైద్య సిబ్బంది సీపీఆర్



సీ..న్ టూ సీన్ : సముద్రం మధ్యలో ఉన్న విదేశీ నౌకలో లైట్లు ఆపేసి మాక్‌డ్రిల్



రక్షణ..తీరాన!

కాకినాడ కోస్ట్‌గార్డు అప్రమత్తమైంది. సముద్ర జలాల ద్వారా పాకిస్థాన్ చొరబడే ప్రమాదం ఉన్నందున ఇక్కడ ఉన్న ఆరు నౌకలతో సముద్రజలాల్లో పహారా పెంచింది. మరోపక్క కాకినాడ, కోనసీమ జిల్లాల వ్యాప్తంగా తొండంగి నుంచి కాకినాడ, అంతర్వేది నుంచి ముమ్మిడివరం వరకు తీరం వెంబడి పోలీసుశాఖ సైతం అప్రమత్తమైంది. డ్రోన్లతో నిరంతర నిఘాను ముమ్మరం చేసింది. ఏ చిన్న అనుమానిత కదలికలు ఉన్నా తక్షణం తెలిసేలా అప్రమత్తమైంది. అటు కస్టమ్స్, పోర్టు, పోలీసు విభాగాలు సైతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా తీరం వెంబడి ఉన్న మెకనైజ్డ్ బోట్లు, చిన్న బోట్లను సైతం అప్రమత్తం చేశాయి. మరో పక్క శత్రుదేశం యుద్ధం ప్రారంభిస్తే ఏ విధంగా ప్రజలు తమను తాము కాపాడుకోవాలి..పోర్టులు.. నౌకలను ఏ విధంగా రక్షించుకోవాలనే దానిపై కాకినాడ యాం కరేజ్, డీప్‌వాటర్ పోర్టులో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు మూడు దఫాలుగా కోస్ట్‌గార్డు ఆధ్వర్యంలో గురువారం మాక్ డ్రిల్ నిర్వహించారు. యాంకరేజ్, డీప్‌వాటర్ పోర్టులపై బాంబుల వర్షం కురిస్తే పోర్టును కాపాడుకోవడం, అత్యవసర వ్యవస్థలను ఏ విధంగా ఉపయోగించాలో చేసి చూపించారు. వివిధ దేశాల నుంచి కాకినాడకు బియ్యం లోడింగ్ కోసం వచ్చి సముద్రంలో లంగరు వేసిన ఎనిమిది నౌకల్లో శుక్రవారం రాత్రి ఏడు గంటల నుంచి 7.15 గంటల వరకు లైట్లన్నీ ఆపేసి చిమ్మ చీకట్లో నౌకలు ఉంటే ఏవిధంగా రక్షించుకోవచ్చో ప్రదర్శించి చూపించారు. కాగా కాకినాడ సీపోర్టులో ప్రస్తుతం ఆరు విదేశీ నౌకలున్నాయి. వీటిలోను రాత్రి లైట్లన్నీ ఆపేసి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

అంతటా అప్రమత్తం

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు తదితర ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఫైర్, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వై జంక్షన్‌లో డ్రిల్ చేపట్టారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్, బస్టాండ్, వైజంక్షన్ తదితర ప్రాంతాల్లో అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో మాక్ డ్రిల్ నిర్వహించారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మార్టిన్ లూథర్ కింగ్ ఆధ్వర్యంలో అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ ఫైర్ డిపార్టుమెంట్ వారు యుద్ధసమయంలో ఎటువంటి సేవలందిస్తారో ప్రయోగాత్మకంగా వివరించారు. బాంబు దాడులు జరిగితే నేలపై పడుకుని రక్షించుకునే విధానాన్ని ప్రజలకు చేసి చూపించారు. జిల్లా అంతటా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పద ప్రదేశాలను పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ కూడళ్ల వద్ద వాహనాల్లో సోదాలు చేస్తూ అనుమానిత వ్యక్తులను ప్రశ్నిస్తున్నారు. విమానాశ్రయంలోనూ మాక్ డ్రిల్స్ నిర్వహించి అవగాహన కల్పించారు. ప్రజలకు అవగాహన కల్పించడమే మాక్‌డ్రిల్స్ ముఖ్యోద్దేశమని అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) ఏవీ సుబ్బరాజు పేర్కొన్నారు. కోనసీమ జిల్లా అమలాపురం కిమ్స్ ఆసుపత్రి వద్ద మాక్‌డ్రిల్ చేపట్టారు. అసాధారణ పరిస్థితుల్లో ప్రజలు తమ ప్రాణాలను కాపాడుకునే విధానాన్ని వివరించారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టర్‌కు రాష్ట్రస్థాయి రెడ్‌క్రాస్ అవార్డు ప్రదానం

కలెక్టరేట్(కాకినాడ), మే 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రెడ్‌క్రాస్ అవార్డును జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌నుంచి అందు కున్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం, అంతర్జాతీయ తలసేమియా దినోత్సవాలను పురస్కరించుకుని విజయవాడ రాజ్‌భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారం అందజేశారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు విస్తృతంగా అందించినందుకు, నిరంతరం రెడ్‌క్రాస్ జిల్లా కమిటీకి దిశానిర్దేశం చేసినందుకు కలెక్టర్‌కు ఈ పురస్కారం వచ్చింది. కాకినాడ జిల్లా కలెక్టర్‌కు ఈ అవార్డు రావడం జిల్లాకే గర్వకారణమని పలువురు వ్యాఖ్యానించారు. మానవతాసేవా కార్యక్రమాలు బలోపేతానికి కృషి చేస్తున్నవారికి ఈ అవార్డు ఇవ్వడం విశిష్టగుర్తింపు ఇచ్చిందన్నారు. రాష్ట్రస్థాయిలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అవార్డు కలెక్టర్ పొందడంపట్ల ఎంతో సంతోషకరమని జిల్లా అధికారులు, ఇతర సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు. కాగా, ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు పాల్గొన్నారు.

'ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాటు చేయాలి'

కలెక్టరేట్(కాకినాడ), మే 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్నిచర్యలను సమన్వయంతో చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు గురువారం వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 20 వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు మొత్తం 21,541మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. వీరిలో మొదటి సంవత్సరం పరీక్షలకు 15,933మంది రెండో సంవత్సరం పరీక్షలకు 5,608 మంది పరీక్షలకు హాజరవుతున్నారు. జిల్లాలో మొత్తం 36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటలనుంచి సాయంత్రం 5.30గంటల వరకు జరుగుతాయన్నారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి శారద, డీపీవో రవికుమార్ పాల్గొన్నారు.

ఏపీఐసెట్ ప్రవేశ పరీక్షకు.. 1,747మంది హాజరు

- ఆరు పరీక్షా కేంద్రాల్లో నిర్వహణ
- 92శాతం హాజరు నమోదు

కాకినాడరూరల్,మే 8(ఆంధ్రజ్యోతి):ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకోసం విశాఖ ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఏపీఐసెట్-2025 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా జరిగినట్లు సెట్ చైర్మన్, వీసీ జీపీ రాజశేఖర్ తెలిపారు. జిల్లాలో ప్రగతి ఇంజనీరింగ్, ఆదిత్య యూనివర్సిటీ, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల, సాఫ్ట్ టెక్నాలజీ, ఐయాన్ డిజిటల్ జోన్ మొదలైన ఆరు పరీక్షా కేంద్రాల్లో రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించామన్నారు. ఉదయం 9గంటల నుంచి 11.30గంటల, మధ్యాహ్నం 2గంటలనుంచి 4.30 గంటల వరకూ నిర్వహించిన పరీక్షలకు మొత్తం 1,904మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1,747మంది హాజరుకాగా 157మంది పరీక్ష రాయలేదని తెలిపారు. మొత్తం 92శాతం హాజరు నమోదైందన్నారు.

గుర్తింపు లేని పాఠశాలలను మూసివేయించాలి

- డీఈవో రమేష్

తొండంగి, మే 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్నిమండలాల్లో గుర్తింపులేని పాఠశాలలు ఉంటే తక్షణం మూసివేయించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ మండల విద్యాశాఖాధికారులకు సూచించారు. గురువారం ఆయన మండల విద్యాశాఖాధికారులతో ఆన్‌లైన్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. గుర్తింపులేని పాఠశాలల్లో చేరవద్దని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సూచించాలన్నారు. పదో తరగతి ఫెయిలైన విద్యార్థులంతా సప్లమెంటరీ పరీక్షకు హాజరయ్యే విధంగా చూడాలని, వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉత్తీర్ణత సాధించి పైచదువులు కొనసాగేలా చూడాలన్నారు. ప్రతిరోజూ ఎన్రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించి పాఠశాలల్లో నమోదు పెంచాలన్నారు.దీనినిమిత్తం 9న క్లస్టర్ స్థాయిలో ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించి ఎన్రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించేలా చూడాలన్నారు. దీనికి మండల విద్యాశాఖాధికారులు ఇద్దరూ చెరొక సమావేశానికి హాజరుకావాలన్నారు. న్యూట్రీ గార్డెన్‌ల ఏర్పాటు నిమిత్తం విడుదలైన మొత్తంతో గార్డెన్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు పాఠశాలల క్యాంపస్‌లో పుస్తకాలు, యూనిఫాం దుకాణాల ఏర్పాటును అనుమతించకూడదన్నారు. జూన్ 28న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు.

అవినీతికి అందలం!

- కాకినాడ నగరపాలక సంస్థలో ఉన్నతాధికారుల లీలలు
- పారదర్శకత కోసం స్క్రూట్నీ సెల్
- దాని ఏర్పాటులోనే మాయాజాలం చేసి.. ఓ ఉద్యోగి హోదా మార్చేసిన అధికారులు
- కమిషనర్ ఆదేశాలు సైతం తుంగలోకి తొక్కిన వైనం



కార్పొరేషన్(కాకినాడ), మే 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ సెక్షన్‌లో సరికొత్త లీలలు బయట పడుతున్నాయి. ఇటీవల ఏర్పాటు చేసిన స్క్రూట్నీ సెల్ ఉదంతమే దీనికి ఒక ఉదాహరణ.

కమిషనర్‌ను తప్పుదారి పట్టించి..

కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగాన్ని పటిష్టపరచడం కోసం స్క్రూట్నీ సెల్ ఏర్పాటు చేయాలని ఐఏఎస్ అధికారిణి, కమిషనర్ భావన ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దీనివల్ల సమర్థవంతమైన పని నిర్వహణతోపాటు ప్రాజెక్టులు, పనులపై ఈ సెల్ ఎప్పటికప్పుడు మోనటరింగ్ చేస్తూ ఉంటుందని సెల్ ఉద్దేశాన్ని కమిషనర్ తెలిపారు. ఆమె ఆదేశాలను కూడా తుంగలోకి తొక్కి అధికారులు అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులు పారదర్శకంగా, జవాబుదారీతనంతో జరగడానికి, పనుల అంచనా బిల్లులు, వాటికి సంబంధించిన ఫైళ్ల నిర్వహణ ప్రాసెస్ చేయడానికి ఈ సెల్‌ను ప్రధానంగా ఉద్దేశించారు. పరిపాలన విభాగంలోను, ఇతర ప్లానింగ్‌లోను నాణ్యతలోపించకుండా స్క్రూట్నీ సెల్ పనిచేస్తుంది. దీంతోపాటు ఇంజనీరింగ్ సెక్షన్‌లో ఎక్కడా ఆలస్యం జరగకుండా నిజాయితీగా నిబద్ధతతో పనులు జరిగేందుకు ఈ సెల్ పనిచేస్తుంది. దీనికోసం ఆరుగురు సభ్యులతో ఒక సెల్‌ను ఇంజనీరింగ్ సెక్షన్ ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు. దీనికి స్వయంగా కమిషనర్ అనుమతి ఇచ్చి ఉత్తర్వులు జారీ చేశారు.

సెల్‌లో అర్హత లేని సభ్యుడు

ఇంజనీరింగ్ సెక్షన్‌లో నిజాయితీగా పనులు జరగడం కోసం, నీతిగా పనులు నిర్వహించడంకోసం ఏర్పాటు చేసిన ఈ సెల్ అవినీతి మార్గంలో ఏర్పాటు కావడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. దీనికి అర్హత లేని సభ్యులను ఎంపిక చేయడమే ఒక ఉదాహరణ. కనీస బాధ్యత లేకుండా ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు ఒక ఉద్యోగి చేస్తున్న ఉద్యోగాన్నే మార్చి రికార్డ్స్‌లో అనుమతి పత్రం ఇచ్చేశారు. ఇందులో ఆరుగురు సభ్యుల్లో ఒక వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను సభ్యుడిగా తీసుకోవాల్సి ఉంది. కార్పొరేషన్‌లో ఎంతోమంది వర్క్‌ఇన్‌స్పెక్టర్లు ఉండగా వాళ్లు ఎవరికీ అవకాశం ఇవ్వకుండా ఈ సెల్ ఏర్పాటులో కీలక బాధ్యతలు వహించిన కొంత మంది అధికారులకు చేయి తడిపి వారికి అనుకూలంగా ఉండే ఫిల్టర్ బెడ్ ఆపరేటర్‌ను వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా చూపించారని, అతడినే ఈ సెల్‌లో సభ్యుడిగా నియమించారని సమాచారం. ఐఏఎస్ అధికారిని కూడా తప్పుదోవ పట్టించి ఆదేశాలు జారీ అయ్యేలా ఏర్పాట్లు చేసుకున్నట్టు సమాచారం. ఈ సెల్ ఏర్పాటు వెనుక కొంత సొమ్ము చేతులు మారినట్లు సమాచారం. అందుకే ఉద్యోగం కూడా మార్చి అర్హత లేని వ్యక్తిని అందలం ఎక్కించారని కార్పొరేషన్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఉత్తర్వులు రద్దు చేయాలని..

ఈ వ్యవహారంలో ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు ఎంత అవినీతికి పాల్పడ్డారో బయట పెట్టాలని, అక్రమ మార్గంలో సెల్‌లోకి వచ్చిన అవినీతి ఉద్యోగిని బయటకి తప్పించాలని, దీనికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఉత్తర్వులు ఇప్పించడంలో ఇంజనీరింగ్ విభాగంలోని ఒక కీలకమైన పోస్ట్‌లో ఉన్న ఉద్యోగి సంబంధిత గుమస్తా, సూపరింటెండెంట్ సంతకాలకు సదరు ఫైల్‌ను పంపకుండా తానే సంతకం చేసి దొడ్డిదారిన ఐఏఎస్ కమిషనర్‌తో స్వయంగా ఉత్తర్వులపై సంతకం చేయించిన సంగతి కూడా బయటపడింది. దీనిపై కూడా విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు. దీనిపై కమిషనర్ భావనను వివరణ అడగ్గా వెంటనే విచారణ చేసి ఆ ఉత్తర్వులు రద్దు చేసేందుకు ఫైలు పెట్టాలని ఆ కీలక ఉద్యోగిని ఆదేశించారు. అయినా ఇంకా సదరు కీలక ఉద్యోగి ఆ ఫైలు పెట్టకుండా ఉండడానికి పలు మార్గాలు వెతుకుతున్నట్లు వినికిడి.

మావోయిస్టుల .. మృతదేహాలు తరలింపు

- నేడు రంపచోడవరంలో పోస్టుమార్టం.. బంధువులొస్తే అప్పగింత
- సంఘటనా వివరాలను సమీక్షించిన అల్లూరి ఎస్పీ అమిత్ బర్దర్



మృతదేహాలను మైదాన ప్రాంతాలకు తరలిస్తున్న పోలీసులు



రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న మృతదేహాలు

వై.రామవరం / రంపచోడవరం, మే 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం శేషరాయి అటవీ ప్రాంతంలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టుల మృతదేహాలను గురువారం పోలీసులు రంపచోడవరం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గ్రేహౌండ్స్ పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు స్పెషల్ జోనల్ కమాండర్ జగన్, డిస్ట్రిక్ట్ కమాండర్ రమేష్ మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ వై.రామవరం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి ఎన్‌కౌంటర్ వివరాల గురించి ఆరా తీశారు. రంపచోడవరం డీఎస్పీ ప్రశాంత కుమార్ వివరాలను తెలుసుకున్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన సరిహద్దు ప్రాంతాల ప్రజలు ఈ సంఘటనతో తీవ్రభయాందోళనకు గురయ్యారు. ఆ ప్రాంతంలో సుమారు మూడు వందల మంది పోలీసులు మోహరించడంతో గిరిజనుల రాకపోకలు స్తంభించాయి. గత 19 ఏళ్లగా ప్రశాంతంగా ఉన్న ఏవోబీ జోన్‌లోని వై.రామవరం మండలం ఒక్కసారిగా ఈ సంఘటనతో ఉలిక్కిపడింది. కాగా ఎన్‌కౌంటర్లో మృతిచెందిన ఇద్దరు మావోయిస్టు అగ్ర నేతలు జగన్, రమేష్ మృతదేహాలను గురువారం మధ్నాహ్నం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పోలీసు అధికారులు పేర్కొన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతుల బం ధువులు వస్తే వారికి అప్పగించే అవకాశం ఉందన్నారు.

ఇదిలా ఉండగా ఆసుపత్రి చుట్టూ పోలీస్ పహరా ఏర్పాటు చేశారు.

ట్రాక్టర్ అపహరించిన దొంగ అరెస్టు

- వివరాలు వెల్లడించిన రాయవరం ఎస్ఐ సురేష్‌బాబు

రాయవరం, మే 8 (ఆంధ్రజ్యోతి): పుల్లల లోడుతో ఉన్న ట్రాక్టర్, ట్రైలర్‌ను అపహరించుకుపోయిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్టు రాయవరం ఎస్ఐ డీ.సురేష్‌బాబు తెలిపారు. గురువారం ఆయన రాయవరంలో విలేకరులకు వివరాలు వెల్లడిస్తూ... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం పసలపూడిలో మార్చి 10వ తేదీన స్థానిక గోదావరి రైస్‌మిల్లు దగ్గర ట్రాక్టర్‌తో పాటు పుల్లల లోడుతో ఉన్న ట్రైలర్ అపహరణకు గురైనట్టు ఆ గ్రామానికి చెందిన పిల్లి జానకి రామయ్య రాయవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్, సీఐ పి.దొరరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, గురువారం ఉదయం 10 గంటల సమయంలో వెదురుపాక శివారు గీతామందిరం వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా బిక్కవోలు మండలం కొంకుదురు వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్‌ను ఆపగా, అది చోరీ ట్రాక్టర్ అని నిర్ధారణకు వచ్చింది. దీంతో అనపర్తి మండలం నల్లమిల్లి సూర్యనారాయణరెడ్డి అనే డ్రైవర్‌ను అరెస్టు చేసినట్టు చెప్పారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్ఐ, హెచ్‌సీ సత్యకుమార్, పీసీ వీరేంద్రను ఉన్నతాధికారులు అభినందించారు.

మాంగల్య ధారణ మహోత్సవం



కమనీయం
దివ్య కల్యాణం


- సత్యదేవుడి కల్యాణాన్ని వీక్షించి తరించిన భక్తజనం
- పులకించిన రత్నగిరి
- వెండి గరుడ వాహనంపై స్వామి, వెండి గజ వాహనంపై అమ్మవారి ఊరేగింపు



కల్యాణోత్సవం సందర్భంగా జరిగిన నృత్య ప్రదర్శన



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న అతిథులు



గరుడ, గజ వాహనాలపై స్వామి ఊరేగింపు

అన్నవరం, మే8(ఆంధ్రజ్యోతి): భువన మోహన రూపుడైన సత్యదేవుడి కల్యాణం గురువారం రాత్రి రత్నగిరిపై భక్తజన నేత్రానందంగా అంగరంగ వైభవంగా జరిగింది. ఆద్యంతరహితుడైన స్వామి, అనంతలక్ష్మి అమ్మవారిని పరిణయమాడిన వేళ ప్రకృతి పరవశించగా రత్నగిరి పులకించింది. మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు, సుగంధభరిత పుష్పపరిమళాలతో స్వామి సన్నిధి అణువణువునా కల్యాణ శోభతో శోభిల్లింది. కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం అంకురార్పణతో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, నాందీదేవత పఠన నిర్వహించిన అర్చకులు ధ్వజారోహణం చేసి గరుడ ద్విభాగం ఎగురవేసి స్వామి కల్యాణానికి ముక్కోటి దేవతలను ఆహ్వానించారు. చైర్మన్ ఐవీ రోహిత్ పండితులకు దీక్షా వస్త్రాలను అందజేశారు. రాత్రి ఏడు గంటలకు బాజాభజంత్రీలు, వేద మంత్రాలు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ సత్యదేవుడికి వెండి గరుడ వాహనంపైన, అనంతలక్ష్మి అమ్మవారికి వెండి గజ వాహనంపై గ్రామోత్సవం జరిపి కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. సర్వ శిల్పకళా శోభితమై వివిధ పరిమళ పుష్పాలు, విద్యుద్దీపాల అలంకరణతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన వార్షిక కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్లను ఆశీనులు గావించి అర్చకస్వాములు కల్యాణ తంతుకు శ్రీకారం చుట్టారు. పెళ్లి పెద్దలుగా వ్యవహరించిన సీతారాములను మరో వేదికపై ఆశీనులు గావించి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, కన్యావరుణ ఇచ్చి అమ్మవారితో మంగళగౌరీ పూజ చేయించారు. స్వామి, అమ్మవార్ల వంశవృక్షాలను వివరించే ప్రవరలను వేద పండితులు పఠించారు. ద్విజత్వాన్ని ప్రసాదించే సువర్ణ యజ్ఞోపవీతాన్ని మంత్రపూర్వకంగా స్వామికి అలంకరించారు. శ్రీచరణుని పాదాలను పవిత్ర జలంతో కడిగి పాదప్రక్షాళన, మధుపర్కప్రాశన జరిపి మధుపర్కాలను స్వామికి ధరింపజేశారు. చతుర్వేద పండితులు దేశ కాలమాన పరిస్థితులను వివరించే మహాసంకల్పం చెప్పి చూర్ణికా మంత్రాలు పఠించారు. సుముహూర్త వేళ భక్తరక్షణలో ఒకరికొకరు బాసటగా ఉండాలంటూ జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని స్వామి, అమ్మవార్ల శిరస్సులపై ఉంచారు. అమ్మవారికి దివ్యతేజస్సు ప్రసాదించే యుగచ్ఛిద్రాభిషేకం నిర్వహించగా భక్తజన గోవింద నామస్మరణ మధ్య మాంగల్యం తంతునానేనా లోకరక్షణ హేతునా అంటూ అమ్మవారి మెడలో స్వామి మూడు ముళ్లు వేశారు. స్వామి, అమ్మవార్లు ఒకరి శిరస్సుపై మరొకరు మంచి ముత్యాల తలంబ్రాలు వేసుకుంటూ భక్తులకు నేత్రానందం కలిగించారు. పట్టుపీతాంబరాలు, విశేష ఆభరణాలతో నుదుట తిలకం, బుగ్గన చుక్కతో స్వామి, అమ్మవార్లు దివ్య తేజస్సుతో భక్తులకు దర్శనమిచ్చారు. కల్యాణ తంతును ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి నిర్వహించగా వేడకలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, తుని ఎమ్మెల్యే యనమల దివ్య, ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవీ రోహిత్ పాల్గొన్నారు. కల్యాణాన్ని వీక్షించారు. వైదిక కార్యక్రమాలను చామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి, ఇంద్రగంటి వెంకటేశ్వర్లు తదితరులు నిర్వహించారు. కల్యాణం అనంతరం తొమ్మిది ప్రత్యేక కౌంటర్ల ద్వారా తలంబ్రాల అక్షింతల ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేశారు. సుమారు 150 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఆ చిన్నారిది హత్యే..!

- పిఠాపురంలో అత్యంత అమానుష ఘటన
- క్షుద్రపూజలు అభూత కల్పనే
- పోలీసుల దర్యాప్తులో వెలుగుచూస్తున్న షాకింగ్ నిజాలు



చిన్నారి యశ్విత (ఫైల్)

పిఠాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో అత్యంత అమానుషంగా ఆరునెలల చిన్నారిని చిదిమివేసిన సంఘటన కీలక మలుపు తిరిగింది. హత్య చేసినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం ఆ దిశగా పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. పిఠాపురం పట్టణం జగ్గయ్యచెరువు కాలనీలోని ఒక ఇంటి లో నిద్రిస్తున్న ఆరునెలల చిన్నారిని నూతిలో పడవేయడం, అలాగే సమీపంలో క్షుద్ర పూజల ఆనవాళ్లు కనబడటం తీవ్ర సంచలనం రేకెత్తించింది. ఈ సంఘటనపై పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో షాక్ కలిగించే విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఇంటి వద్ద గుర్తించిన విషయాలు, క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్ విచారణలో వెల్లడయిన అంశాలు ఆధారంగా చిన్నారి యశ్వితను హత్య చేసినట్టు నిర్ధారించారు. ఇంటిలోకి పరాయి వ్యక్తులు వచ్చే అవకాశం లేదని స్పష్టం కావడంతో ఇది కుటుంబసభ్యుల పనేనని నిర్ధారించారు. అందరిని తప్పుదోవ పట్టించేందుకే ఇంటి ముందు పసుపు, కుంకుమ, నిమ్మకాయ పెట్టి క్షుద్ర పూజల నాటకం ఆడినట్టు తెలుస్తోంది. అయితే ఇందులో ఎవరెవరి పాత్ర ఉందనే విషయాన్ని నిర్ధారించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. కాగా చిన్నారి మృతదేహాన్ని తండ్రి సతీష్‌కు పోలీసులు అప్పగించారు.

12న అప్రెంటీస్ మేళా

కార్పొరేషన్ (కాకినాడ), మే 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని వివిధ కంపెనీల్లో అప్రెంటీస్ ఖాళీలను భర్తీ చేయడానికి కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 12 ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నారు. ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులను జిల్లాలోని ప్రముఖ పరిశ్రమల మేనేజ్‌మెంట్, స్టాఫ్ వచ్చి వారికి కావలసిన వారిని ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేసుకుంటారు. ఐటీఐల్లో వివిధ ట్రేడ్లలో ట్రైనింగ్ పూర్తి చేసి ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో మేళాకు హాజరుకావాలని కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కన్వీనర్, కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల వర్మ కోరారు.

వయస్సు 23..అప్పులు రూ.5 లక్షలు

అన్న కళ్లెదుటే గోదావరిలోకి దూకి తమ్ముడు ఆత్మహత్య



భార్గవ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అల్లవరం మే 8(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ అల్లవరం మండలం బోడసకుర్రు బ్రిడ్జి పైనుంచి గురువారం మధ్యాహ్నం ఓ యువకుడు వైనతేయ గోదావరిలోకి దూకి మృతిచెందాడు. అతడిని రక్షించేందుకు స్థానికులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అల్లవరం పోలీసుల కథనం ప్రకారం.. అమలాపురం రూరల్ మండలం కామనగరువు గ్రామానికి చెందిన కామన భార్గవ్(23) గురువారం మధ్యాహ్నం బోడసకుర్రు బ్రిడ్జి పైనుంచి గోదావరిలోకి దూకేశాడు. ఆ సమయంలో తమ్ముడిని రక్షించేందుకు అన్న రాజేష్ కూడా దూకేశాడు. రాజేష్ చేతికి చిక్కి నట్టే చిక్కిన భార్గవ్ చేయి జారిపోయాడు. నీటి ప్రవాహానికి కొట్టుకుపోతున్న రాజేష్‌ను పైనుంచి గమనించిన ఓ లారీ డ్రైవర్ పగ్గం వేయడంతో రాజేష్ పగ్గం సహాయంతో అక్కడే కొట్టుమిట్టాడాడు. ఈ లోపు స్థానిక మత్స్యకారులు పడవ వేసుకుని వెళ్లి రాజేష్‌ను ఒడ్డుకు చేర్చారు. భార్గవ్ మాత్రం దొరకకపోగా స్థానికులు తాళ్లు వేసి రక్షించే ప్రయత్నం చేశారన్నారు. భార్గవ్ తాడును వదిలించుకుని నదిలోపలికి వెళ్లి గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు గాలింపు చర్యలు చేపట్టగా యువకుడు దూకిన కొద్ది దూరంలోనే మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ టి.తిరుమలరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ ఘటనతో బోడసకుర్రు బ్రిడ్జిపై వాహనాలు నిలిచి పోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కాగా భార్గవ్ సుమారు రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడని, తనకు అప్పులు ఇచ్చిన వాళ్లు చెల్లించాలని ఒత్తిడి చేస్తుండడంతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిసింది.

అల్లూరి విగ్రహానికి పాలాభిషేకం

రెల్లుగడ్డలో అల్లూరిని అవమానించిన వైసీపీ నాయకుల తీరును కూటమి నిరసన



రెల్లుగడ్డలో అల్లూరి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న కూటమి నాయకులు

అల్లవరం, మే 8(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు రైతుల సమస్యలను గాలికి వదిలేసిన వైసీపీ నాయకులు వారి పక్షాన పోరాటం చేస్తున్నట్టు అమలాపురంలో నిరసన శిబిరంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటం పక్కన తమ కాళ్లకు చెప్పులతో అవమానించారని వైసీపీ నేతలు బహిరంగ క్షమాపణ చెప్పాలని టీడీపీ కూటమి నేతలు గురువారం నిరసన తెలిపారు. అల్లవరం మండలం రెల్లుగడ్డలో మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు పచ్చిమాల ఏడుకొండలు పర్యవేక్షణలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి కూటమి నేతలు పాలాభిషేకం చేసి వైసీపీ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెప్పులు వేసుకుని అల్లూరిని అవమాన పరిచిన వీడియో వైరల్ అవ్వడంతో టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. వైసీపీ నేతలు బహిరంగ క్షమాపణ చెప్పాలని వారికి మంచి బుద్ధి ప్రసాదించాలంటూ నినాదాలు చేశారు. అల్లూరి వర్ధంతి నిర్వహించిన వైసీపీ నేతల్లో ఓ మాజీ మంత్రి, ఇద్దరు ఎమ్మెల్సీలు, వైసీపీ నేతలు చెప్పులు వేసుకోవడం దారుణమని అన్నారు. నిరసన కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కదలి వెంకటేశ్వరరావు, నడింపల్లి చంటిరాజు, పోతుల నాగరాజు, తోట నరసింహరావు, కొపనాతి తాతాజీ, కళ్లేపల్లి రామరాజు, వేగిరాజు శ్రీనురాజు, నార్గన శ్రీనివాస్, రాసూరి రాంబాబు, మామిడిశెట్టి శ్రీరామ్, నడింపల్లి సుబ్బరాజు, మందం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్‌గా స్వామినాయుడు



మోతుగూడెం, మే 8(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం సీలేరు కాం ప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ ఎంవీ స్వామినాయుడును నియమిస్తూ విజయవాడ విద్యుత్ సౌధా నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన విజయవాడ విద్యుత్ సౌదాలో హెచ్‌పీసీలో చీఫ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న స్వామినాయుడు సీలేరు కాంప్లెక్స్‌కు బదిలీపై వస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావుకు కడప ఆర్టీపీపీ స్టేషన్ చీఫ్ ఇంజనీర్‌గా బుధవారం బదిలీ అయ్యారు. వాసుదేవరావు సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్‌గా 11 నెలల పని చేశారు. ఏపీ జెన్కోకు కొత్తగా సీలేరు కాంప్లెక్స్‌కు స్వామినాయుడు బాధ్యతలు స్వీకరించే వరకు లోయర్ సీలేరు సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ ఓఎండ్ఎంగా పని చేస్తున్న చిన్న కామేశ్వరరావుకు చీఫ్ ఇంజనీర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

మత్స్య శాఖాధికారులపై విచారణకు ఆదేశం


కాకినాడ మే 8 (ఆంధ్రజ్యోతి): మత్స్య శాఖలో అధికారులుగా పనిచేస్తూ ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడిచిన పలువురిపై శాఖాపరమైన విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఏలూరు మత్స్య శాఖ జేడీగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఫణిశేఖర్, భీమవరం డిప్యూటీ డైరెక్టర్ తిరుపతయ్యలపై విచారణ చేపట్టాలని ఆదేశించింది. స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీకు చెందిన అడిషినల్ డెరెక్టర్ ఆఫ్ ఫిషరీస్‌కు విచారణ బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారనే అభియోగాలపై ఏలూరు మత్స్య శాఖ సూపరింటెండెంట్‌గా పనిచేసి రిటైర్ అయిన దీనదయాల్‌పైనా శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. ఇలా ఆరుగురు అధికారులపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

11న తలసేమియా బాధితులకు వైద్యశిబిరం

రాజమహేంద్రవరం సిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని రౌతు తాతాలు కళ్యాణ మండపంలో ఈనెల 11న తలసేమియా బాధితుల కోసం ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని జైన్ సేవా సమితి వ్యవస్థాపకుడు విక్రమ్ జైన్ తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తలసేమియా బాధితులకు ప్రతీ 20 రోజులకు రక్తం ఎక్కించాలని లేకుంటే నిరసించిపోయి మరణించే ప్రమాదముందన్నారు. ఇప్పటి తమ సంస్థ ఆధ్వర్యంలో 17 మందికి బోన్ మ్యారో ఆపరేషన్ చేయిస్తే అందులో 14 మంది బతికారని చెప్పారు. ఈ ఆపరేషన్‌కి రూ.25ల క్షలు ఖర్చవుతుందన్నారు. జాగృతి బ్లేడ్ బ్యాంక్ వైద్యుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ తలసేమియా మైనర్లు ఇద్దరు వివాహం చేసుకుంటే వారికి పుట్టే పిల్లలు తలసేమియా బారిన పడతారని చెప్పారు. ముందుగా పరీక్షలు చేయించకుంటే హెచ్‌బీలో ఏ2 పెరిగివుంటే గుర్తించి తల్లి నుంచి బిడ్డకు సంక్రమించకుండా వైద్యం చేయించుకోవచ్చన్నారు. దీనికి సంబంధించిన పరీక్షకు రూ.2 వేలు అవుతుందని దానిని ఈ శిబిరంలో ఉచితంగా చేస్తున్నామని చెప్పారు. మాగ్న వైద్యుడు వినయ్ మాట్లాడుతూ తలసేమియా బాధితులకు రక్తం ఇచ్చేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. సమావేశంలో అశ్విన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌పురం ఎంపీడీవో సస్పెన్షన్

వీఆర్‌పురం, మే 8(ఆంధ్రజ్యోతి): వీఆర్ పురం ఎంపీడీవో శశిభూషణ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. గత రెండు నెలలుగా ఎంపీడీవో ఉన్నత స్థాయి అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విధులకు హాజరుకావడం లేదని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, మద్యం తాగి, సిబ్బందిని దూషించడం వంటి విషయాలు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లాయి. ఈ క్రమంలోనే ఆయనను సస్పెండ్ చేశారు. ప్రస్తుతం కూనవరం ఎంపీడీవో అంజనేయప్రసాద్‌కు వీఆర్‌పురం ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు.



వైభవంగా భావనారాయణస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

సర్పవరం జంక్షన్, మే 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సర్పవరంలో భావనారాయణస్వామి వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామిని గరుడ వాహనంపై ఉంచి తిరువీధి ఉత్సవం నిర్వహించి ఎదురు సన్నాహం జరిపారు. రాత్రి 9గంటలకు అశేష భక్తుల గోవిందనామస్మరణ మధ్య వేదపండితుల మంత్రోచ్ఛారణలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు తలంబ్రాలను పంపిణీ చేశారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సేవలకు కలెక్టర్ ప్రశాంతికి పురస్కారం



రాజమహేంద్రవరం, మే 8(ఆంధ్రజ్యోతి): ఇండి యన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యకలాపాలకు విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించడం, ప్రజా ప్రయోజనాలకు సొసైటీ సేవలను సమర్థవంతంగా వినియోగించడంతో కలెక్టర్ పి.ప్రశాంతికి రెడ్ క్రాస్ సొసైటీ పురస్కారం దక్కింది. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంతికి గవర్నర్ అబ్దుల్ నజీర్ పురస్కారాన్ని అందజేశారు. 2022-23లో పశ్చిమ గోదావరి కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన సమయంలో సొసైటీ కార్యకలాపాలను చురుగ్గా అమలు చేయడంతో ఈ అవా ర్డుకు ఆమె ఎంపికయ్యారు.కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో రెడ్ క్రాస్ కార్యక్రమాలను విస్తృత పరచాలన్నారు. సభ్యత్వ నమోదు పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. కలెక్టర్ ప్రశాంతికి జేసీ చిన్న రాముడు తదితరులు అభినందనలు తెలిపారు.

కాకినాడ బీచ్‌లో సైకత సిందూరం



ఆపరేషన్ సిందూర్ సైకత శిల్పం వద్ద ఏర్పాటుచేసిన జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న పోలీసులు

సర్పవరం జంక్షన్/గొల్లప్రోలు రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో 'ఆపరేషన్ సిందూర్' సైకత శిల్పం ఆవిష్కృతమైంది. యంగ్ మైండ్స్ సంస్థ ఆధ్వర్యంలో సైకత శిల్పి, గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపా ధ్యాయుడు పిల్లి గోవింద రాజులు, వాకాడ చిన్న గురువారం సుమారు ఏడు గంటల పాటు కష్టపడి మహిళా ఆర్మీ కల్నల్ సోఫియా ఖురేషీ సైకత శిల్పాన్ని తీర్చిదిద్దారు. దాని వద్ద జాతీయ పతాకం ఏర్పాటు చేయగా బీచ్‌కు వచ్చిన పర్యాటకులు, ఇతరులు గౌరవ వందనం సమర్పించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, మే 8 (ఆంధ్రజ్యోతి): మాధవపట్నం 11 కేవీఏ ఉప కేంద్రంలో పలు ఫీడర్లకు చెంది ట్రీ కటింగ్, మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఏవీఎస్డీఎస్ ప్రభాకర్ తెలిపారు. మాధవపట్నం, వీకే రాయపురం, సత్యవరపుపేట, మామిళ్ళదొడ్డి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.



కల్యాణంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు దంపతులు

వైభవంగా విశ్వేశ్వరస్వామి కల్యాణం

కాకినాడ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామారావుపేటలో అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి దివ్య కల్యాణం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు-జ్యోతి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణ కర్తలుగా పాల్గొన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కల్యాణాన్ని వీక్షించగా ప్రోత్సాహకుడు టీవీ రమణారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో బాదం శ్రీనివాస రామచంద్రరావు, టీడీపీ నగర శాఖ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు (బుజ్జి), ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జి, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు మేకా లక్ష్మణమూర్తి, కూటమి నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబు, గింజాల శ్రీనివాస్, చిందాన శ్రీనివాస్, పసుపులేటి వెంకటేశ్వరరావు, ఆళ్ల బాలకృష్ణ, నెక్కంటి శ్రీనివాస్, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో తారస్థాయికి వివాదం



కాకినాడ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఇరువర్గాల వివాదం ఇప్పట్లో చల్లారేలా లేదు. గురువారం తారస్థాయికి చేరింది. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు నివాసం వద్ద ఇరువర్గాల తోపులాటకు దారితీసింది. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గూడవల్లి మృత్యుంజయరావు తన కార్యవర సభ్యులతో ఎమ్మెల్యే కొండబాబుకు పూలదండలు వేయడానికి వచ్చారు. అక్కడే ఉన్న గత అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు దీన్ని అడ్డుకున్నారు. వాళ్లతో కొండబాబు దండ వేయించుకుంటే తన కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకుంటుందని శ్రీనివాసరావు హెచ్చరించారు. ఎన్నికలకు ముందు కొండబాబుకు టికెట్ రాదని, కూటమి ప్రభుత్వం గెలవదని వైసీపీకి పని చేసిన ముత్యం అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉండటం ఏమిటని మండి పడ్డారు. దీంతో ఇరువర్గాల వారు గుంపులుగా చేరి వాగ్వివాదానికి దిగారు. టీడీపీ నాయకులు, పోలీసులు వారిని ఎంత వారించినా అరుపులు, కేకలతో తోపులాటకు దిగారు. పరిస్థితి చక్కబడకపోవడంతో ముత్యం వర్గాన్ని అక్కడి నుంచి పోలీసులు పంపించి వేశారు. బుధవారం రాత్రి 11 గంటల వరకు ఎమ్మెల్యే నివాసం వద్ద ఉద్రిక్త పరిస్థితి కొనసాగింది.



రక్తదాతను అభినందిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

అభివృద్ధి పనులకు శ్రీకారం

కరప, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పంతం నానాజీ గురువారం పర్యటించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వలసపాకలలో రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించి, పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. కరప పీహెచ్‌సీ ఆవరణలో ల్యాబ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. చంద్రన్న సమావేశ మందిరంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి దాతలను అభినందించారు. హైస్కూలు ప్రాంగణంలో వ్యవసాయ శాఖ నిర్వహించిన కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు పవర్‌టిల్లర్లు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ కాకినాడ రూరల్ కో కో-ఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, కరప డీసీ ఛైర్మన్ పీజీ సత్యనారాయణ, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, తహసీల్దారు నందిపాటి సత్యనారాయణ, ఏడీ కె.బాబూరావు, ఏవో అప్పసాని వెంకటరాజేష్, ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాస్, ఏఈ సాయిబాబారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శ్రీనివాస్, ఏఈ వర్ధన్, పంచాయతీరాజ్ ఏఈ శైలజ, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాష్‌గౌడ్, ఏఎంసీ ఛైర్మన్ ముద్రగడ రమేష్, టీడీపీ, జనసేన మండల శాఖల అధ్యక్షులు దేవు వెంకన్న, బండారు మురళి, నాయకులు బొగిరెడ్డి కొండబాబు, గంగాధర్, యాళ్ల పండు, అనుకుల రాంబాబు, గుల్లిపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కార్యవర్గం

పిఠాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం విస్తృత స్థాయి సమావేశం పిఠాపురం బైపాస్‌లోని కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా డేగల సత్యనారాయణ, అధ్యక్ష, కార్యదర్శులుగా పప్పు వీరబాబు, ఒమ్మి గోవిందు, ఉపాధ్యక్షుడిగా వి. బాబ్జీ, సహాయ కార్యదర్శిగా గోపాలపు సత్యనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా రాయుడు సత్యనారాయణ, సహాయ కార్యనిర్వాహక కార్యదర్శిగా గాది కోటేశ్వరరావు, కోశాధికారిగా దంట్ల గోపాలకృష్ణ, సహాయ కోశాధికారిగా వనం శ్రీను, కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సీఐటీయూ నాయకులు అభినందించారు.

శ్రీకుక్కుటేశ్వరస్వామి జల ప్రసాదం

పాదగయలో రెండు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసిన దివీస్ లేబొరేటరీస్

పిఠాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆలయాలకు వచ్చే భక్తులు సురక్షిత తాగునీరు లభించకపడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక ఆర్వో వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు దివీస్ లేబొరేటరీస్ ముందుకు వచ్చింది. కాకినాడ జిల్లాలోని పిఠాపురం పాదగయ క్షేత్రం, సామర్లకోట కుమారరామభీమేశ్వరస్వామి ఆలయం, తుని సమీపంలోని తలుపులమ్మ లోవ, అన్నవరం సత్యదేవుని ఆలయం, కోనసీమలోని ద్రాక్షారామ ఆలయ ప్రాంగణాల్లో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



ఒక్కో ఆర్వో వాటర్ ప్లాంటును రూ.15లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్నారు. వీటి నిర్వహణ బాధ్యతలను కూడా ఆ సంస్థే చూడనున్నది. పిఠాపురం పాదగయ క్షేత్రంలో శ్రీకుక్కుటేశ్వరస్వామి జలప్రసాదం పేరుతో రెండు ఆర్వో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఇందుకు అవసరమైన నిర్మాణాలను వారే చేపటారు. పాదగయలోని రాజగోపురం, పుష్కరిణి చెంతన ఒకటి, కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం కార్యాలయం చెంతన మరొకటి నిర్మించారు. వీటికి గురువారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఇవి అందుబాటులోకి వస్తే వేసవిలో ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉంటుందని ఆలయ అధికారులు చెప్పారు.

డీఎస్సీ ఆన్‌లైన్ ఉచిత శిక్షణ ప్రారంభం

కలెక్టరేట్ (కాకినాడ), మే 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో డీఎస్సీ ఆన్‌లైన్ ఉచిత శిక్షణ తరగతులు గురువారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఆర్థిక భారం కారణంగా శిక్షణ తీసుకోలేని నిరుద్యోగ యువతను ప్రోత్సహించే లక్ష్యంతో కాకినాడకు చెందిన ప్రఖ్యాత శ్యామ్ ఇనిస్టిట్యూట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. నాలుగు రోజుల క్రితం ఆన్‌లైన్ ద్వారా అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించగా విశేష స్పందన లభించింది. ఉచిత శిక్షణకు నమోదు చేసుకునేందుకు గడువును శుక్రవారం వరకు పొడిగించారు.

పీఏసీఎస్ మాజీ సీఈవో మృతి

పెద్దాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): కట్టమూరు పీఏసీఎస్ మాజీ సీఈవో పెద్దింటి సీతా వెంకట నరసింహాచార్యులు (61) బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన కట్టమూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈవోగా సుదీర్ఘ కాలం పని చేసి గత ఏడాది ఉద్యోగ విరమణ చేశారు. పీఏసీఎస్ ద్వారా పలు రైతు సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు రైతులకు ఎన్నో పథకాలను చేరువ చేసేందుకు విశేష కృషి చేశారు. నరసింహాచార్యులు మృతికి పలువురు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

‘కుట్టు శిక్షణలపై విమర్శలు అవాస్తవం’

సామర్లకోట, మే 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేద మహిళల ఉపాధి కల్పనా పథకం కుట్టు శిక్షణలపై విమర్శించే ఆరోపణల్లో వాస్తవాలు ఎంతమాత్రం లేవని, కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత వైసీపీ నేతలకు లేదని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్ అన్నారు. గురువారం సామర్లకోటలోని టీడీపీ పట్టణ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.



216 జాతీయ రహదారిపై ఆరబోసిన ధాన్యం రాశులు

రైతులకు ఆరబోత కష్టాలు

పిఠాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): రైతుల ధాన్యం ఆరబోత కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించట్లేదు. వరి కోత యంత్రాలతో మాసూళ్లు పూర్తిచేసిన రైతులు ఇప్పటివరకు ధాన్యాన్ని 17శాతం తేమ వచ్చే వరకు పొలాలు, కల్లాలు, రహదారుల వెంబడి ఆరబెట్టారు. వారం వ్యవధిలో మూడుసార్లు కురిసిన భారీ వర్షాలకు పలుచోట్ల ధాన్యం రాశులు తడిసిపోయాయి. బరకాలు, టార్పాలిన్లు కప్పిన ధాన్యంలోకి నీరు చేరింది. దీంతో కాకినాడ-కత్తిపూడి మధ్య 216 జాతీయ రహదారిలో గొల్లప్రోలు, చేబ్రోలు, పిఠాపురం బైపాస్ రోడ్లు,గొల్లప్రోలు-పిఠాపురం-సామర్లకోట రహదారి, పిఠాపురం-చిత్రాడ-పండూరు-తిమ్మాపురం రహదారి పొడవునా ఇలా తడిసిన ధాన్యం రాశులను రైతులు ఆరబెట్టారు. ఆకాశం వైపు చూసుకుంటూ కంటిమీద కునుకులేకుండా ధాన్యాన్ని ఆరబోస్తున్నామని, ఎన్ని రక్షణ చర్యలు తీసుకున్నా వర్షం పడితే తడిసిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



భారత్‌మాతాకీ జై నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

భారత సైన్యానికి మద్దతుగా బీజేపీ ర్యాలీ

కార్పొరేషన్ (కాకినాడ), మే 8 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన నరమేధానికి ప్రతీకారంగా భారత సాయుధ బలగాలు చేస్తున్న దాడులకు సంఘీభావంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు నాయకత్వంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. సర్పవరం కూడలి నుంచి నాగమల్లితోట కూడలిలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు భారత్‌మాతాకీ జై నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పైడా కృష్ణమోహన్, వేటుకూరి సూర్యనారాయణరాజు, యెనిమిరెడ్డి మాలకొండయ్య, మీడియా ప్రతినిధి నాని, విశ్వనాథపల్లి శ్రీనివాస్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

జూలై 12న నాయీబ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

కాకినాడ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సూర్యకళా మందిరంలో జూలై 12న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నాయీబ్రాహ్మణ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నాయీబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్టు సంఘ నేతలు వెల్లడించారు. పరిచయ వేదిక ఆహ్వాన కరపత్రాలను సంఘ నేతలు ఇవ్వల రామకృష్ణమూర్తి, సుందరపల్లి గోపాలకృష్ణ గురువారం గాంధీనగర్‌లో ఆవిష్కరించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ 12వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే పరిచయ వేదికకు వచ్చే వధువు, వరుడు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో పాటు తాము ఇచ్చే బయోడేటా ఫారం పూర్తి చేసి తీసుకురావాలన్నారు. సంఘ నేతలు దాలిపర్తి రామకృష్ణ, దంగేటి పాపారావు, వేములూరి గణపతిరావు, నడింపల్లి పాపారావు, విన్నకోట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కవయిత్రి మాతృమూర్తి వెంకటరమణమ్మను సత్కరిస్తున్న కళాభిమానులు

‘మనసును కదిలించేది కవిత్వం’

పిఠాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): మనసును హత్తుకుని కదిలించేది కవిత్వమని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలోని పీఠికాపురం కళా వేదికపై జరిగిన కార్యక్రమంలో కర్నాటక తెలుగు రచయితల సమాఖ్య ఉపాధ్యక్షురాలు ఆకొండి వెంకటలక్ష్మి రచించిన కవితా, వ్యాస సంపుటిలు కవన సవ్వడులు, వ్యాసమంజరి, భావనా కుసుమాలు పుస్తకాలను ఆవిష్కరించారు. ఆమె వీటిని తల్లి ముద్దు వెంకటరమణమ్మకు అంకితమిచ్చి సత్కరించారు. సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం, పుర్తుతికా కల్చరల్ అసోసియేషన్, మన ఊరు మన బాధ్యత సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు కేవీఎస్ఎస్ ప్రసాద్, వెన్నపు చక్రధరరావు, కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్, తటవర్తి సుబ్బారావు, రేగళ్ల నీలకంఠ శర్మ, ఆకొండి శివరామకృష్ణ, ఆకొండి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టీఎస్ఎన్

పెద్దాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా తటవర్తి సత్యనారాయణ విజయం సాధించినట్టు ఎన్నికల అధికారులు సారా మురళీశ్రీనివాస్, వందే విజయరాజ్‌కుమార్, కేఎస్ నాయుడు తెలిపారు. గురువారం బార్ కార్యవర్గం ఎన్నిక సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి నెలకొంది. ఉపాధ్యక్షుడిగా ఎన్.దుర్గాప్రసాద్, జనరల్ సెక్రటరీగా ఎస్‌కే వల్లిబాబు, జాయింట్ సెక్రటరీగా కందుల వెంకటాచలం, కోశాధికారిగా మడికి రాంబాబు, లైబ్రరీ సెక్రటరీగా కొంద్రు సతీష్, స్పోర్ట్స్-కల్చరల్ ప్రతినిధిగా పేరిశెట్టి బాలకృష్ణ ఎన్నికయ్యారు. లేడీ రిప్రజెంటేటివ్‌గా సిలపరశెట్టి విశాలాక్షి, సూపర్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా దేవులపల్లి సూర్యనారాయణమూర్తి, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా ఏవీ జనార్దన్, సకురు దుర్గారావు, జూనియర్ ఎగ్జిక్యూటివ్‌లుగా జమ్మి వెంకట కృష్ణారావు, పలివెల చినచంటి, వైయూఎస్ గణేష్‌కుమార్, వీవీఎస్ నారాయణమూర్తి ఎన్నికయ్యారు.



‘బౌద్ధ ఆరామాలను పరిరక్షించాలి’

కాకినాడ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): బౌద్ధ ఆరామాలను పరిరక్షించాలని, 1949 యాక్ట్ రద్దు చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేడ్కర్) జాతీయ కార్యదర్శి పిట్టా వరప్రసాద్ డిమాండ్ చేశారు. బిహార్‌లోని బుద్ధ గయలో బౌద్ధులు 86 రోజులుగా కొనసాగిస్తున్న నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు.

‘దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి’

కాకినాడ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ లాభాల కోసం మోదీ నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చారని కేంద్ర కార్మిక సంఘాల నేతలు ధ్వజమెత్తారు. ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం టీచర్స్ హోమ్‌లో జిల్లా సదస్సు నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పారెడ్డి, ఐఎన్‌టీయుసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు, ఏఐసీసీటీయూ రాష్ట్ర కన్వీనర్ గౌడుగు సత్యనారాయణ మాట్లాడారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, కోశాధికారి మలకా రమణ, సత్య నారాయణ, కాళ్ల నాగేశ్వరరావు, మేడిశెట్టి వెంకటరమణ, గుబ్బల ఆదినారాయణ, రాగుల రాఘవులు, గరగ దుర్గారావు, చంద్రమళ్ల పద్మ, వేణి తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలో మాట్లాడుతున్న నరసింగరావు

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో గడిగట్ల సత్తిబాబు అధ్యక్షతన సీఐటీయూ మండల కమిటీ సమావేశం గురువారం జరిగింది. రాష్ట్ర కమిటీ ప్రచురించిన సమ్మె బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. నాయకులు దాడి బేబి, మాగాపు నాగు, గూనూరు రమణ, తాడిశెట్టి గంగ, డి.క్రాంతికుమార్ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్

జీజీహెచ్‌లో మజ్జిగ చలివేంద్రం

జీజీహెచ్ (కాకినాడ), మే 8 (ఆంధ్రజ్యోతి): జీజీహెచ్ ప్రాంగణంలో శరణ్య ట్రస్టు ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.పాండురంగవిఠల్ గురువారం ప్రారంభించారు. ఈఎన్‌టీ విభాగం విశ్రాంత హెచ్‌వోడీ డాక్టర్ జీఎస్ఎన్ మూర్తి, అడ్మినిస్ట్రేటర్ ఎన్.శ్రీధర్, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన

కాకినాడ క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియమ, నిబంధనలపై కాకినాడ ట్రాఫిక్-1,2 సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు బాలాజీచెరువు కూడలిలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. యూనిఫామ్ ధరించడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, వాహన రికార్డు కూడా ఉంచుకోవాలన్నారు. ఎస్‌ఐ ఎ.బాలాజీ, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు పండ్లు పంపిణీ

కలెక్టరేట్ (కాకినాడ), మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ రెడ్‌క్రాస్ భవన్‌లో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. తొలుత రెడ్‌క్రాస్ వలంటీర్లతో జేసీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసేమియా చిన్నారులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ ఛైర్‌పర్సన్ సుగుణ, కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.



వేదిక పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

రేపటి నుంచి శాంతి మహోత్సవాలు

కాకినాడ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సువార్తికుడు పాల్ దినకరన్ కాకినాడ రావడం మనకు ఎంతో గర్వకారణమని సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. కాకినాడ మెక్లారిన్ హైస్కూలు గ్రౌండ్‌లో లూక్ మెమోరియల్ పీస్ టెంపుల్ బిషప్ యెల్చూరి విద్యాసాగర్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే శాంతి ప్రార్థనా మహోత్సవాల వేదిక పనులను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. పీస్ ఫెస్టివల్ నిర్వాహకుడు విద్యాసాగర్ మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. మిషన్ టు ది నేషన్ డైరెక్టర్ యెల్చూరి పాపారావు, యెల్చూరి జోసఫ్, దయాగృహం, యెల్చూరి సుధాకర్, బెరెకా చర్చి ఫౌండర్ జోసఫ్ జెస్సీ, మోజెస్ కిరణ్, రాజా చౌదరి, కల్చర్ ఆఫ్ కనెక్టివిటీ సీఈవో విక్టర్‌విల్సన్, పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

పెద్దిపాలెంలో వాటర్ ట్యాంక్ ప్రారంభం

ప్రత్తిపాడు, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలో పెద్దిపాలెంలో రూ.37.80లక్షలతో నిర్మిస్తున్న 40వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. పెద్దిపాలెంనుంచి ఉత్తరకంచి రహదారి నిర్మాణ పనులు నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమాల్లో సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు చైర్మన్ ఐ.అప్పారావు, రీసు సత్తిబాబు, కుండల అప్పారావు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

రంపచోడవరంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు శంకుస్థాపన


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, మే 8 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం యూనియన్ బ్యాంక్ ఆవరణలో అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల వారికి రెండు పూటల అన్నం తినే విధంగా దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు రెండు రూపాయలకే కిలోబియ్యం ఇచ్చారన్నారు. ఏజెన్సీలోని మారుమూల గ్రామాల నుంచి రంపచోడవరం వివిధ పనులకోసం వచ్చే వారికి అన్నా క్యాంటిన్ ద్వారా రూ.5లకే భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఐటీడీఏ పీవో మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజలకు నియోజకవర్గ కేంద్రంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయడం శుభపరిణామన్నారు. 50రోజుల్లో భవనం పూర్తయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. జీసీసీ డైరెక్టర్ జీడీ సునీత మాట్లాడుతూ రానున్న రోజుల్లో గిరిజన ప్రాంత అభివృద్ధికి ప్రతిఒక్కరు కలసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు పి.రామకృష్ణ, సర్పంచ్‌లు మంగా బొజ్జయ్య, వంతల అచ్చియమ్మ, ఎంపీడీవో సుండం శ్రీనివాస్‌దొర, డిప్యూటీ తహశీల్దారు జిలాని, సీఐ రవికుమార్, ఎస్ఐ వెంకటరావు, స్థానిక నాయకులు అడబాల బాపిరాజు, కారం సురేష్, వై.నిరంజనీదేవి, సలాది బాపిరాజు, పెంటపాటి అనంతమోహన్, సిద్ద వెంకన్నబాబు, షేక్ సుభాని, పోటోజు సురేష్, పండా చెల్లన్నదొర, పి.శ్రీనివాస్, బంగారు వీరబాబు, ఏపీఎం రామ కామేశ్వరస్వామి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణస్వామి కల్యాణం


వైదికపై ఆశీనులైన శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి

ఎటపాక, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటపల్లి, చోడవరం గ్రామాల్లో ఉన్న శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి తిరుకల్యాణ మహోత్సవంను గురువారం వైభవంగా నిర్వహించారు. తొలుత ఆల యాల ఆవరణలో ప్రత్యేకంగా ఆలంకరించిన వేదికపై శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామివారి ఆశీనులయ్యారు. ఈనేపథ్యంలో మధ్యాహ్నం సమయంలో అర్చకులు గొట్టిపుళ్ల చెన్నకృష్ణమాచార్యులు నేతృత్వంలో కల్యాణంను శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా తోటపల్లిలో స్వామివారికి పట్టు వస్త్రాలు,కల్యాణ మంగళసూత్రాలు తలంబ్రాలను స్థానికులు కడియాల వెంకటేశ్వరరావు దంపతులు, వెల్లంకి సుధాకర్‌బాబు దంపతులు అందజేశారు. ఈకార్యక్ర మంలో వల్లభనేని చందు, కడియాల వెంకట్, దు ద్దుకూరి సతీష్, బండారు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

గ్రామకమిటీలతో టీడీపీ బలోపేతం


ఎంపికైన గ్రామకమిటీ సభ్యులకు ధ్రువపత్రాలు అందిస్తున్న టీడీపీ నాయకులు

రంపచోడవరం, మే 8(ఆంధ్రజ్యోతి): గ్రామ కమిటీల నియామకాలతో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతానికి కృషిచేయాలని టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు అడబాల బాపిరాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని భూసిగూడెంలో గ్రామకమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఒంటుకుల ఆదిరెడ్డి, బచ్చల జోగిరెడ్డిలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెంటపాటి అనంతమోహన్, సిద్దా వెంకన్నదొర, పాటోజు సురేష్, బసవ సంకురమ్మ, సోమలమ్మ, భూమిరెడ్డి పాల్గొన్నారు.

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న కొత్తపల్లి పంచాయతీ గ్రామకమిటీల నియామకంతో పార్టీ బలోపేతం అవుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. గురువారం కొత్తపల్లి గ్రామకమిటీ ఎన్నిక ఏకగ్రీవ మైంది. కొత్తపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పైడా సుబ్బయ్యను, ప్రధాన కార్యదర్శిగా పల్లాల రమణారెడ్డిని ఎన్నుకున్నారు. మాజీ సర్పంచ్ కర్రం లక్ష్మణ్, చింతూరు అడ్‌హాక్ సభ్యులు ఎన్నుకున్నారు. మండల టీడీపీ నాయకులు వెంకటేశ్వరరావు జహంగీర్, మధు, జమాల్‌ఖాన్, ఎస్‌ఏ ఆసిఫ్, కొత్తపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.


కొత్తపల్లి గ్రామంలో టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక దృశ్యం

చింతూరులో వాహనాల తనిఖీ


చింతూరులో వాహనాలను తనఖీ చేస్తున్న పోలీసులు

చింతూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండల పరిధిలో జరిగిన ఎన్‌కౌంటర్ నేపథ్యంలో చింతూరులో గురువారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఎన్‌కౌంటర్ తదుపరి మావోయిస్టులు తప్పించుకో వచ్చన్న అభిప్రాయంతో పోలీసులు ప్రతి వాహనాన్ని నిలువరించి తనిఖీలు చేశారు. అనుమానితులనుంచి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.


యర్రవరంలో ప్రతిష్ఠించిన సీతారామ, లక్ష్మణుల విగ్రహాలు

వైభవంగా సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ

ఏలేశ్వరం, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రవరంలో నూతన రామాలయాన్ని ప్రారంభించారు. గురువారం ఆలయ కమిటీ నేతృత్వంలో పురోహితులు హోమాలు, అభిషేకాలు నిర్వహించి శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, టీడీపీ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.


వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

గండేపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): గండేపల్లిలోని అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణం మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదురోజుల కల్యాణ మహోత్సవంలో భాగంగా స్వామికి పూజలు నిర్వహించారు. ప్రతిఏటా స్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ పసగాడ రామకృష్ణ తెలిపారు.

కోటనందూరులో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కోటనందూరు, మే 8(ఆంధ్రజ్యోతి): కోటనందూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రాజవరం ఫీడర్ విద్యుత్ లైన్‌కు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంతోపాటు లైన్ మెయింటెనెన్స్ వల్ల కేవో అగ్రహారం, కేఏ మల్లవరం గ్రామాల్లోని గృహవినియోగదారులతోపాటు చిన్నతరహా పారిశ్రామికవేత్తలకు, వ్యవసాయ రైతులకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. శుక్రవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ ఉండదని ఏఈ వీరభద్రరావు తెలిపారు.

పాత్రికేయుల సేవలు కీలకం

శంఖవరం, మే 8(ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో పాత్రికేయుల పాత్ర కీలకమని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్(బాబీ) అన్నారు. కత్తిపూడి పాత్రికేయుడు కేశంగి హరినాథ్ ఏపీయుడబ్ల్యూజే జిల్లా జాయింట్ సెక్రటరీ ఎన్నికైన సందర్భంగా గురువారం జనసేన సభ్యులు సన్మానం చేశారు. జనసేన ప్రోగ్రాం కమిటీ సభ్యులు కరణం సుబ్రహ్మణ్యం, మండల అధ్యక్షుడు గాబు సుభాష్ పాల్గొన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

మజ్జిగ పంపిణీ

జగ్గంపేట, మే 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ రోడ్డులోని బాలాజీ జ్యూయల్స్ ఎదురుగా వాసవీక్లబ్ ఆధ్వర్యంలో బాటసారులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామానికి చెందిన నీలి అర్జునరావు, రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు(కొండబాబు) ముఖ్య అతిథిగా హాజరై మజ్జిగ పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు.

సతీష్‌బాబును కలిసిన ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, మే 8(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌ని కాకినాడలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో గురువారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చించారు. ఆమె వెంట నాయకులు బస్వా వీరబాబు, భూపాలపట్నం ప్రసాద్ తదితరులు ఉన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం

గండేపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం ఎండల తీవ్రత ఉన్నా సాయంత్రం వర్షం పడింది.





ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో జాతీయ జెండాతో ర్యాలీ జరుపుతున్న దృశ్యం

ఆపరేషన్ సిందూర్‌కి మద్దతుగా ర్యాలీ

జగ్గంపేట, మే 8(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో ఎన్నారై కల్లేపల్లి రాజేష్ కుటుంబం ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్‌కి మద్దతుగా భారీర్యాలీ నిర్వహించారు. దీనికి మద్దతుగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. పహల్గంలో పాకిస్తాన్ ఉగ్రవాదుల దుశ్చర్యలకు ప్రాణాలు కోల్పోయిన భారత పౌరులకు నివాళులర్పించారు. ఆపరేషన్ సిందూర్ భారత సైనిక పరాక్రమానికి మరో గర్వకారణమని జగ్గంపేట నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ తోట నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆపరేషన్ సింధూర్‌పై ఎమ్మెల్యే నెహ్రూ హర్షం

ఉగ్రవాదాన్ని అంతం చేయడమే ప్రధాని మోదీ పంతమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. రావులమ్మనగర్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాక్ ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరిట చేసిన దాడులను స్వాగతించారు. సమావేశంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు పాల్గొన్నారు.

సిందూర్‌పై వసంత్ ప్రశంసలు

గండేపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): పాక్‌లో ఉగ్రవాత స్థావరాలపై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కి గండేపల్లి మండలం టీడీపీ యువ నాయకుడు, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్ ప్రశంసలు కురిపించారు. ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన సైనికులకు సెల్యూట్ చేస్తున్నానని ఆయన అన్నారు.

తీరప్రాంతంలో భద్రత కట్టుదిట్టం

తొండంగి, మే 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో అద్దరిపేటనుంచి చోడిపల్లిపేట వరకూ తీర ప్రాంతంలో భద్రత కట్టుదిట్టం చేసినట్లు తొండంగి ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. దేశంలో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో తీరగ్రామాల్లో అపరిచితుల కదలికలపై నిఘా ఉంచామన్నారు. స్థానికులకు ఎవరైనా అపరిచిత అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వారి సమాచారం పోలీసులకు తెలపాలని సూచించామన్నారు. తీరంలో అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు తెలిపామన్నారు. డ్రోన్ సహాయంతో గ్రామాల్లో నిఘా పెంచామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ


వ్యవసాయ క్షేత్రం వద్ద లబ్ధిదారులకు పవర్ టిల్లర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, మే 8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తెలిపారు. వ్యవసాయశాఖ కార్యాలయంవద్ద గురువారం 39మంది లబ్ధిదారులకు రూ.34లక్షల విలువ చేసే పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు, ఇతర వ్యవసాయ పరికరాలను వ్యవసాయాధికారి వైవీ గంగాధర్‌తో కలిసి రైతులకు పంపిణీ చేశారు. హైస్కూల్ సమీపంలోని జీవనోపాధుల శిక్షణా కేంద్రం వద్ద మండలంలోని 140మంది మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. కూటమి నాయకులు యాళ్ల జగదీష్, అమరాది వెంకట్రావు, ఇళ్ల అప్పారావు, జింకల తాతారావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వెలుగుల నాని, బి.వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు ఎం.సూర్యకిరణ్, గోపిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

అరుణోదయ సభలను జయప్రదం చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

జగ్గంపేట, మే 8(ఆంధ్రజ్యోతి): అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాల ముగింపు సభల కరపత్రాలను జగ్గంపేట మండలం రంగవల్లినగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ భూమి భుక్తి.. ఈ దేశ విముక్తి కోసం సాగిన పోరాటాల్లో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తన కళలతో ప్రజలను చైతన్యపరుస్తూ కీలక భూమిక పోషించిందన్నారు. ఈనెల 12న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో 50 వసంతాల ముగింపు సభ జరుపుకుం టుందని, ఈ సభను విప్లవ సానుభూతి పరులు, విద్యార్థి మేధావులు, కార్మికులు, కర్షకు లు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు, పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్ తదితరులు పాల్గొన్నారు.


అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

అల్లూరికి ఘన నివాళి

జగ్గంపేట, మే 8(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో భగత్‌సింగ్ నగర్ కాలనీలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆయనకు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రగతిశీల యువజన సంఘం జిల్లా నేత గంటా బాలరాజు, చిన్నారి, వీర వేణి పాల్గొన్నారు.


ప్రజాదర్బార్‌లో సమస్యలు వింటున్న ప్రభుత్వ విప్ తుని ఎమ్మెల్యే దివ్య

సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

ప్రభుత్వ విప్ తుని ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. తుని గర్ల్స్ హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యేతోపాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరితో కలిసి ప్రజా సమస్యలను పరిష్కరించేదిశగా చర్యలు చేపట్టారు. తుని పట్టణంలో పలు వార్డుల్లో స్థానిక టీడీపీ నాయకులు కౌన్సిలర్లతో కలిసి 15 ఆర్థిక సంఘం నిధులతో రూపొందించిన సీసీ రోడ్లు మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో యనమల రాజేష్, తుని పట్టణ టీడీపీ అధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ, చింతమనీడి అబ్బాయి పాల్గొన్నారు.

తునిలో రక్తదాన శిబిరం

తుని రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా బాధిత చిన్నారులకోసం గురువారం ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. మమతా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రితోపాటు రోటరీక్లబ్ మెంబర్స్, పలు స్వచ్ఛంద సేవా సంస్థలు కలిసి ఈ ర్యాలీ చేపట్టాయి. తుని రోటరీ క్లబ్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించగా 80మందికిపైగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చారు. రోటరీక్లబ్ ప్రెసిడెంట్ సీహెచ్ మంగరాజు, సెక్రటరీ ఎస్.వీరరాజు, కిషోర్‌రెడ్డి ఉన్నారు.

ప్రత్తిపాడు కోర్టు ప్రభుత్వ అసిస్టెంట్ న్యాయవాదిగా చిట్టిబాబు

అన్నవరం, మే 8(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు కోర్టు ప్రభుత్వ అసిస్టెంట్ న్యాయవాదిగా అన్నవరానికి చెందిన న్యాయవాది రాజాల చిట్టిబాబును నియమిస్తూ అమరావతిలో లాసెక్రటరీ ప్రతిభాదేవి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. మూడేళ్లపాటు ఈ పదవిలో ఆయన కొనసాగనున్నారు

టీడీపీలోకి వైసీపీ సర్పంచ్

తుని రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనకు ఆకర్షితులై రాజుపేట సర్పంచ్ బుద్దాల సత్తిబాబు ఎమ్మెల్యే దివ్య సమక్షంలో టీడీపీ క్యాంప్ ఆఫీస్‌లో టీడీపీలోకి చేరారు. వీరికి యువ నేత యనమల రాజేష్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఏరియా ఆసుపత్రిలో మాక్ డ్రిల్

చింతూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): యుద్ధ సన్నద్ధత నేపథ్యంలో చింతూరు ఏరియా ఆసుపత్రిలో గురువారం వైద్య బృందం మాక్ డ్రిల్ నిర్వహించింది. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కోటిరెడ్డి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు సకాలంలో అందించడమే మాక్ డ్రిల్ ఉద్దేశ్యమన్నారు. ఆ మేరకు వైద్య బృందాలను సంసిద్ధపర్చడం జరిగిందన్నారు. వైద్య బృందాలలో సమన్వయం మెరుగుపర్చుకొనే దిశగా సూచనలిచ్చామ న్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ సహాయ సహకారాలు అంది పుచ్చుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో గైనకాల జిస్టు డాక్టర్ రమణారావు, జనరల్ ఫిజీషియన్ డా. కిషోర్ రెడ్డి, డా. సుధీర్, డా. కౌసిక్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.


చింతూరు ఏరియా ఆసుపత్రిలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

డీఎస్సీ ఆన్‌లైన్ ఉచిత శిక్షణ ప్రారంభం

కలెక్టరేట్ (కాకినాడ), మే 8 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో డీఎస్సీ ఆన్‌లైన్ ఉచిత శిక్షణ తరగతులు గురువారం లాంఛ నంగా ప్రారంభమయ్యాయి. ఆర్థికభారం కారణంగా శిక్షణ తీసుకోలేని నిరుద్యోగ యు వతను ప్రోత్సహించే లక్ష్యంతో కాకినాడకు చెందిన ప్రఖ్యాత శ్యామ్ ఇనిస్టిట్యూట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. నాలుగు రోజుల క్రితం ఆన్‌లైన్ ద్వారా అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించగా విశేష స్పందన లభించింది. ఉచిత శిక్షణకు నమోదుకు గడువును శుక్రవారం వరకు పొడిగించారు.

పీఏసీఎస్ మాజీ సీఈవో మృతి

పెద్దాపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): కట్టమూరు పీఏసీఎస్ మాజీ సీఈవో పెద్దింటి సీతా వెంకట నరసింహాచార్యులు (61)బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన కట్టమూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈవోగా సుదీర్ఘ కాలం పనిచేసి గత ఏడాది ఉద్యోగ విరమణ చేశారు. పలు రైతు సేవా కార్యక్రమాలు చేయడంతోపాటు రైతులకు ఎన్నో పథకాల ను చేరువ చేసేందుకు విశేష కృషి చేశారు.